క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సునంద

సైదాపురం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని రాపూరు సీడీపీఓ సునంద అన్నారు. తిప్పిరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులోభాగంగా బాల్యా వివాహాలు, బాలల హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

త్రైతసిద్ధాంత క్యాలెండర్ అందజేత

చిట్టమూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ అధికారులకు త్రైత సిద్ధాంత క్యాలెండర్లు మంగళవారం అందజేశారు. ఎంపీడీఓ మనోహర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్, ఎస్‌ఐ చిన్నబలరామ్య, నిరంజన్ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ బాబురావులకు ఉగాది తెలుగు క్యాలెండర్లు అందజేశారు. సేవా సమితి శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం, సభ్యులు శ్రీనివాసులు, జానా శ్రీనివాసులు, చామంతి, సుమలత పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఓజిలి: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేయించి టీడీపీ నాయకులతో కలిసి ఆమె మొక్కలను నాటారు. ఈఓపీఆర్డీ రేణుక, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి

కోట: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం కోటలో నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని హనుమాన్ భక్తబృందం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కోట తూర్పువీధిలోని వీరాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కోట నుంచి అన్ని వీధులను కలుపుతూ కోట క్రాస్‌రోడ్డు వరకు సాగుతుందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని శివాలయం వీధిలో మంగళవారం సాయంత్రం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు కరెంట్ ఆఫీస్ ప్రాంతానికి చెందిన లక్ష్మి శివాలయం సమీపంలోని బాలసుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడని అతని ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈక్రమంలో అక్కడ బాలసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు, లక్ష్మికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అక్కడే స్పృహ కోల్పోయింది. విషయం తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లి మహిళను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జనసేనలో వర్గపోరు

–సభ్యత్వ కిట్ల పంపిణీలో విభేదాలు బట్టబయలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి జనసేనలో వర్గపోరు మొదలైంది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి, వర్గ విభేదాలు చాపకింద నీరులా ఉండేవి. అయితే మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు, కిట్ల పంపిణీలో వర్గపోరు బహిర్గతమై రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వివరాలు..వెంకటగిరి జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ప్రెసిడెంట్ బృందం సమక్షంలో పార్టీ క్రియాశీల సభ్యత్వ, కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశ ప్రారంభంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్సనల్ స్టేట్ టీమ్ పాల్గొని ప్రసంగిస్తుండగా పట్టణంలోని ఓ వర్గానికి చెందిన జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. పార్టీలో తొలి నుంచి కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఇక్కడి కార్యక్రమానికి ఎందుకు పిలవలేదంటూ ప్రశ్నించారు. దీంతో అక్కడే సభా వేదికపై ఉన్న మరో వర్గం వారిని వేదిక నుంచి దించే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం తారస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం జనసేన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జంపాల ప్రకాష్ ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ తగ్గకపోగా మాటల యుద్ధం తీవ్రస్థాయిలో చోటుచేసుకుంది. పార్టీకి తొలి నుంచీ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నియోజకవర్గ పీఓగా వ్యవహరించిన గూడూరు వెంకటేశ్వర్లకు తగిన ప్రాధాన్యత కల్పించలేదని కొందరు ధ్వజమెత్తారు. దీనిపై జంపాల ప్రకాష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఆ వ్యక్తిని సస్పెండ్ చేసిందని, పార్టీ దిశా నిర్దేశాల మేరకు వ్యవహరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీంతో సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది.



వాగ్వాదం చేసుకుంటున్న జనసేన శ్రేణులు

కమనీయం..కల్యాణం



వాకాడు: అందలమాల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి స్వామి వారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శిరసనంబేడు సిద్ధారెడ్డి, భూదేవమ్మ దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పూజలు, హోమాలు నిర్వహించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నాయుడుపేటటౌన్: విజయవాడలో వచ్చేనెల 5న జరిగే ఉద్యోగుల 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయుడుపేట తాలుకా యూనిట్ అధ్యక్షుడు భారతాల సాయి రామ్‌కిషోర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆ సంఘ డివిజన్ నాయకులు, ఉద్యోగులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘ అసోసియేట్ ప్రెసిటెండ్ మల్లుగోపాల్, వైస్ ప్రెసిడెంట్‌లు సుమలత, స్వర్ణలత పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

రాపూరు: మైనారిటీల స్వయం ఉపాధి కోసం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ భవాని మంగళవారం తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు కలిగిన ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పారశీకులు అర్హులని చెప్పారు. ఈనెల 25వ తేదీలోగా అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంపీడీఓకు సన్మానం

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డీడీఓలు మంగళవారం ఘనంగా సన్మానించారు. సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓను సన్మానిస్తున్న సిబ్బంది

విలేకరికి నివాళి

కలువాయి(సైదాపురం): చేజర్ల మండల సాక్షి విలేకరి తోట రవీంద్రబాబు మృతిచెందారు. ఆయన స్వగ్రామమైన కుల్లూరు గ్రామానికి మంగళవారం మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఆయన మృతదేహానికి సాక్షి నెల్లూరు యూనిట్ మేనేజర్ శ్రీనివాసులు, నెల్లూరు బ్యూరో ఇంచార్జ్ మస్తాన్‌రెడ్డి, చేజర్ల వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి అంత్యక్రియల కోసం సాక్షి యాజమాన్యంతోపాటు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు



ఆర్థిక సాయం అందజేస్తున్న సాక్షి సిబ్బంది

దక్షిణ కాలువకు నీరు విడుదల

కలువాయి(సైదాపురం): కలువాయి గ్రామంలోని చెరువు నుంచి రైతులకు రెండవ పంట సాగు కోసం మంగళవారం సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరి కేశవ చౌదరి, కలువాయి ఇరిగేషన్ ఈఈ మల్లికార్జున దక్షిణ కాలువకు నీటిని విడుదల చేశారు. నీటి విడుదలపై చేజర్ల, కలువాయి మండలాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. నీటి విడుదల కార్యక్రమంలో అధికార పార్టీ కన్వీనర్ హాజరుకాకపోవడం గమనార్హం.



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

రౌడీ షీట్ అన్యాయం

దక్కిలి: దేవునివెల్లంపల్లిలోని వైఎస్సార్‌సీపీ నేతలు కోళ్లూరు బాలకృష్ణ, శ్రీనివాసులు ఇద్దరు అన్నదమ్ములపై ఆదివారం డక్కిలి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ డక్కిలి మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది డక్కిలి పోలీసులు టీడీపీ నేతల ప్రాద్బలంతోనే వైఎస్సార్‌సీపీ నేతలపై రౌడీషీట్ నమోదు చేసినట్లు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలన్న లక్ష్యంతోనే డక్కిలి పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. పోలీసుల వ్యవహారం ఇలాగే కొనసాగితే న్యాయపోరాటం చేస్తామన్నారు.

కండలేరులో 42.974 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 42.974 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,930, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైభవం..పుష్పయాగం

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం రాత్రి పుష్పయాగ పూజలను టీటీడీకి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానకిషోర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి గ్రామపెద్దలు పాల్గొన్నారు.



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధిలో అందరికీ ప్రాధాన్యం

చిల్లకూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడం క్షేత్ర సహాయకుల బాధ్యత అని ఏపీఓ గిరిబాబు అన్నారు. ఏరూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కొంతమంది కూలీలు తమకు మూడు వారాలుగా వేతనాలు అందడం లేదని అడగడంతో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు.



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

నోటీస్ బోర్డు

రేపటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

- బాలాయపల్లి(సైదాపురం): తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నుంచి ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి లియోనా తెలిపారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమజ్జయంతి వేడుకలు రేపు

- రాపూరు: రాపూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు మూలమూర్తికి పంచామృతాభిషేకం, 12గంటలకు తమలపాకులతో ప్రత్యేక పూజలు, రాత్రి 8 గంటలకు సింధూరంతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రామనాదేశ్వరశర్మ తెలిపారు. అలాగే మద్దెమడుగులోని మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయం బయట ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

కుల్లూరులో క్రికెట్ టోర్నమెంట్

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కుల్లూరులో ఈనెల 23వ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రీమియం లీగ్ మ్యాచ్‌ల నిర్వాహకుడు సునీల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో మొదటి స్థానం విజేత జట్టుకు రూ.15,116, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10,116 ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్రారంభం రేపు



సూళ్లూరుపేట: అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.12.77కోట్లతో ఆధునీకరించిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 22న వర్చువల్ పద్ధతిలో ఢిల్లీ నుంచి ప్రారంభించనున్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

వెంకటగిరి రూరల్: లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడిపల్లి చెంగయ్య మాట్లాడుతూ జూలై 9న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నేతలు వి.పెంచలయ్య, రాజయ్య, చిరంజీవి, వెంకటసుబ్బయ్య, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ, రత్నమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

23 నుంచి రాజమునీశ్వరస్వామి ఉత్సవాలు

చిట్టమూరు: మండలంలోని రాజమునీశ్వరస్వామి వార్షికోత్సవాలు ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మెరుగైన వసతులు కల్పించాలి

కోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఐసీడీఎస్ పీడీ వసంతభాయి సూచించారు. మంగళవారం కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక బాలసదన్‌ను పరిశీలించారు. సీడీపీఓ మునికుమారి, సూపర్‌వైజర్లు కవిత, క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు: మండలంలోని పునబాక దళిత కాలనీకి చెందిన పైపూరి స్వాతి(32) మృతదేహానికి మంగళవారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యాశాలలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు. దంపతుల మధ్య గొడవ కారణంగా స్వాతి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన పోలీసులు భర్త మురళిని అరెస్ట్ చేశారు. ఒక పక్క తల్లిని కోల్పోయి, మరోపక్క తండ్రి అరెస్టు కావడంతో చిన్నారులిద్దరు అనాథలుగా మిగిలారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సంబరాలు

కోట: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం కోట ఆర్టీసీ సెంటర్ వద్ద వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో కొంతమంది యువకులు జైజగన్ నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. శ్రీనివాసులు, మధుబాబు, చంటి, రవి పాల్గొన్నారు.